క్లుప్తంగా

న్యాయమూర్తులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక: గాజువాక ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వి.శేషమ్మతో గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గాజువాక బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి న్యాయవాదులను ఆమెకు పరిచయం చేశారు. బెంచ్, బార్ అసోసియేషన్ల మధ్య మంచి సంబంధాలు ఉంటే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సమావేశంలో 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు, 8వ అదనపు జిల్లా జడ్జి కె.కవిత, సీనియర్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం నేడు



ముస్తాబైన లక్ష్మీ గణపతి ఆలయం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పంచవటిలోని లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) అధ్యక్షుడు పి.చిన్నారావు తెలిపారు. ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్‌లు పాల్గొంటారన్నారు. వార్షికోత్సవంతో పాటు పంచవటి పిల్లలకు కోసం ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

ఉక్కు రంగాన్ని స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల అధికారుల సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ నుంచి స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) తీర్మానించిందని విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తెలిపారు. మనాలిలో జరిగిన ఎన్‌సీవోఏ నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్‌లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన పలు అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సెయిల్, విశాఖ స్టీల్ ప్లాంట్, నగర్‌నార్ ప్లాంట్, డిజైన్ సంస్థ మెకాన్, మైనింగ్ సంస్థ కేఐవోసీఎల్‌లను విలీనం చేసి ఒకే గొడుగు కిందకు తీసుకు రావాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే పీఎస్‌యూ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ. 25 లక్షలకు పెంచాలని, సమర్థులైన చైర్మన్లు, డైరెక్టర్లను సత్వరమే నియమించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీవోఏ అధ్యక్షులు ఆడాసుల్, సెక్రటరీ జనరల్ అనీల్‌కుమార్, చైర్మన్ తోమర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్రకుమార్ బంచోర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వినాయకునికి పూజలు చేస్తున్న శ్రీనివాస్

కూర్మన్నపాలెం: కణితి ఆర్‌హెచ్ కాలనీ రజకుల వీధిలోని సిద్ధి బుద్ధి సహిత వరసిద్ధి వినాయక ఆలయ 16వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 87వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో వాండ్రాసి వెంకటరావు పారిపల్లి , ఈశ్వరావు, వండ్రాసి సన్యాసిరావు రమణ , అప్పారావు, కోమటి రమాదేవి, మురళి పాల్గొన్నారు.

జాగింగ్ c/o భెల్ మైదానం



ఉరుకులు.. పరుగుల ప్రపంచంలో వ్యాయామం మనిషి దిన చర్యలో భాగమైంది. ఒత్తిడితో అనారోగ్యం బారిన పడిన వారు.. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి ఇంకొందరు మైదానం బాటపడుతున్నారు. వేకువ జాము నుంచే నడక.. పరుగు.. ఆటలతో మైదానంలో ఉత్సాహంగా గడుపుతున్నారు. అలాంటి వారికి భెల్ మైదానం చోటు కల్పిస్తోంది. అసలే వేసవి సెలవులు రావడంతో చిన్నా పెద్దా అంతా రావడంతో సందడిగా ఉంటోంది.

– అక్కిరెడ్డిపాలెం



వార్మప్‌లో భాగంగా సూర్యనమస్కారం చేస్తున్న వాకర్



భెల్ మైదానంలో వాకింగ్ చేస్తున్న ప్రజలు



గ్రౌండ్‌లో సేద తీరుతున్న యువకులు

పారిశ్రామిక ప్రాంతంలో మైదానాలు లేవు. పార్కులు కూడా అంతంత మాత్రమే. దీంతో నడక.. ఇతర వ్యాయామాల కోసమైనా.. పిల్లలు ఆడుకోవాలన్నా భెల్ మైదానమే దిక్కు. భెల్ టౌన్‌షిప్‌లో సువిశాలమైన మైదానం జాగింగ్ ప్రియులను ఆకర్షిస్తోంది. మైదానం చుట్టూ పచ్చని చెట్లు, కాలుష్యం లేని గాలితో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. దీంతో నడిచే వారిలో మరింత ఉత్సాహం కనిపిస్తుంది. నిత్యం ఉదయం 4 నుంచి జాగింగ్‌కు వస్తున్న వారిలో ఎక్కువశాతం 50 నుంచి 60 సంవత్సరాలు దాటిన వారే ఉంటారు. వీరు 20 నుంచి 30 సంవత్సరాలుగా ఈ క్రీడా మైదానంలో త్యం జాగింగ్, వార్మప్ చేస్తూ తమ బాడీను ఫిట్‌గా ఉంచుతున్నారు. మహిళలు సైతం జాగింగ్‌పై అవగాహన కలిగి ప్రణాళిక ప్రకారం నడకను సాగిస్తుంటారు.



ఆటలు ఆడుతున్న మహిళలు, వాకర్స్

ఆత్మీయతకు నెలవు

నిత్యం జాగింగ్ చేయడమే కాకుండా ఒకరితో ఒకరికి అనుబంధం ఏర్పతుందని పలువురు వాకర్స్ చెబుతున్నారు. వేసవికాలం రావడంతో భెల్ క్రీడా మైదానం చిన్నారులతో పాటు పెద్దవారితో వేకువ జాము నుంచే నిండి పోతుంది. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా క్రికెట్ టోర్నమెంట్లు, ఇతర క్రీడల పోటీలతో మైదానం కళకళలాడుతుంది.

భెల్ క్రీడా మైదానంకు విచ్చేసే వారిలో...

ఒకప్పుడు బీహెచ్‌పీవీ గ్రౌండ్‌గా ఉన్న ఈ క్రీడా మైదానం ప్రస్తుతం అదే పేరుతో కొనసాగుతుంది. ఇటు షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడఅప్పన్నకాలనీ, రాంనగర్, భెల్ టౌన్ షిప్ వాసులు ఈ గ్రౌండ్‌ను వాకింగ్‌కు వినియోగిస్తుంటారు. పలు ప్రాంతాల వాకర్స్ రోడ్డుపై నుంచి నడకను సాగించే వారు. వారు కూడా వాహనాల బెడదతో మైదానం వైపు తమ నడకను కొనసాగిస్తుండడం విశేషం.

25 ఏళ్లుగా మైదానంలో వాకింగ్ చేస్తున్నా..



బీహెచ్‌పీవీగా ఉన్నప్పటి నుంచి గ్రౌండ్‌లో నిత్యం వాకింగ్ చేస్తున్నా. సుమారు గంట వరకు సమయం కేటాయిస్తా. నాకు తెలిసి బీహెచ్‌పీవీ గ్రౌండ్‌లో ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణం ఎక్కడాఉండదని అనుకుంటా. వేసవి కావడంతో మైదానికి వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది. జాగింగ్ ప్రియుల కేరింతలతో ఎంతో సరదాగా ఉంటుంది.

– సీహెచ్.మురళీశ్వరరావు, భెల్ ఉద్యోగి

వాకింగ్‌తో ఉత్సాహం



నేను కొన్ని సంవత్సరాలుగా బీహెచ్‌పీవీ మైదానానికి వాకింగ్‌కు వస్తున్నాను. వాకింగ్ చేయాలంటే వాతారణంతో పాటు మైదానం అనుకూలంగా ఉండాలి. అలాంటి వాతావరణం బీహెచ్‌పీవీ గ్రౌండ్‌లో ఉంది. చాలా మంది భార్యా భర్తలు సైతం వాకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులకు మైదానం మంచి వేదికగా మారింది.

–నంబారు రమణ, వాకర్, షీలానగర్

ప్రశాంత వాతావరణం



నిత్యం వాకింగ్ చేస్తుండడం వల్ల రోజంతా చాలా ఉల్లాసంగా ఉంటాను. బీహెచ్‌పీవీ గ్రౌండ్ మాలాంటి వారికి ఒక వరం అనిచెప్పవచ్చు. ఎంతో ప్రశాంతంగా, స్వచ్ఛమైన గాలితో ఉంటుంది. చుట్టూ చెట్లు మంచి వాతావరణం మధ్యలో వాకింగ్ చేస్తుంటాం . వాకర్స్ క్లబ్ మెంబర్‌గా ఇంకా ఉత్సాహంగా పని చేస్తున్నా.

– ఈటి రంగారావు, వాకర్, మింది.

వాకింగ్‌తో ఫిట్‌గా ఉన్నా...



బీహెచ్‌పీవీ గ్రౌండ్ ఉంటే చాలు అన్నీ ఫిట్‌గా ఉన్నట్లే. కొన్ని నెలలుగా గ్రౌండ్‌కు అలవాటు పడ్డా. రోడ్ల మీద వాకింగ్, జాగింగ్ చేయాలంటే వాహనాలతో భయం. అందుకే వేకువ జామునే గ్రౌండ్‌కు వచ్చేస్తా. గంటపైనే జాగింగ్, వార్మప్ చేస్తా. తర్వాత నా సహోదరులతో కాలక్షేపం చేస్తా. గ్రౌండ్‌లో జాగింగ్ చేసిన తర్వాత రోజంతా ఉల్లాసంగా ఉంటా. ప్రతీ ఒక్కరు వ్యాయామాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి.

–ఈటి శ్రీను, వాకర్, మింది.

అసోషియేషన్లు అంకురం

భెల్ గ్రౌండ్‌లో ఎక్కువ మంది జాగింగ్ కొనసాగిస్తుంటే ఖాళీ ప్రాంతాల్లో ఇతరత్రా ఆటలతో చాలా మంది తమ వ్యాయామాలను సాగిస్తుంటారు. కొన్ని చోట్ల గ్రూపులుగా వార్మప్‌లు చేస్తుంటారు. కొన్ని సంవత్సరాల నుంచి పలువురు విశ్రాంత ఉద్యోగులు వాకర్స్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కూడా ఏర్పాటు చేసుకుని తమ కార్యాకలాపాలు కొనసాగిస్తున్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు



భెల్ ప్రధాన గేటు వద్ద సంతాపం తెలుపుతున్న ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు

పహల్గం అమరులకు సంతాపం

అక్కిరెడ్డిపాలెం: జమ్మూకశ్మీర్ పహల్గంలో టూరిస్టులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను క్షమించకూడదని బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈడువుగంటి అనార్‌బాబు అన్నారు. పహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి అసోసియేషన్ ప్రతినిధులు ఘన నివాళులర్పించి టౌన్ షిప్ నుంచి భెల్ సిగ్నల్ పాయింట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తమ ప్రఘాడ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉరుకూటి అప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు సంద్రాన నూకరాజు, ఈటి రంగారావు, ఉరుకూటి బాబూరావు, తేజ భాస్కరరావు, జమ్మురమణ కబడ్డీ కనకరాజు, సింహాచలం, సుధాకర్, చంటి రెడ్డి, గొలగాని రాంబాబు పాల్గొన్నారు.

• పహల్గంలో ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీటు నాయకులు జి.టి.పి.ప్రకాష్ అన్నారు. శుక్రవారం భెల్ ప్రధాన గేటు వద్ద ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జమ్మూ కశ్మీర్‌లో మంచి వాతావరణం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు సీతన్‌నాయుడు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, కె.నారపురెడ్డి, సీహెచ్.మురళీశ్వరరావు, పి.కనకారావు, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని గాజువాక నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు కాకతీయ ఆర్చ్ వద్ద శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రతి భారతీయుడు ఉగ్ర ఉన్మాదాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. అమాయక పర్యాటకుల ఉగ్రవాదుల దాడులు పిరికిపంద చర్య అన్నారు. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితులో ఉపేక్షించకూడదన్నారు. దాడికి కారణమైన ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, అచ్యుతరావు, పోలయ్య, దుర్గారావు, అప్పారావు, కె. వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ తదితరులు

అమాయకులపై దాడులు శోచనీయం

గాజువాక: దేశ ప్రజల్లో భయాన్ని రేకెత్తించేందుకు ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడులు చేయడం శోచనీయమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి మానవత్వాన్ని మరిచిపోయిన క్రూర చర్య అని అన్నారు. విహారయాత్రకు వెళ్లిన పౌరులపై దాడి జరగడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులు, మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ సభ్యులు పాల్గొన్నారు.

సంపద సృష్టించడమంటే అప్పులు చేయడమా?

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి.గౌస్



ఎస్‌ఎండీ గౌస్

గాజువాక: సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో వనరులను తాకట్టు పెట్టి మితిమీరిన అప్పులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి.గౌస్ అన్నారు. సంపద సృష్టించడమంటే అప్పులు చేయడమా అని ప్రశ్నించారు. గాజువాకలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న ఏపీఎండీసీ నుంచి బాండ్ల రూపంలో రూ.9వేల కోట్ల సేకరణ పేరుతో 436 గనులను తాకట్టు పెట్టారన్నారు. ఇందులో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్‌బీఐ నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండానే బాండ్ల కొనుగోలుదారులకు మళ్లించేందుకు అనుమతులివ్వడం దారుణమన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ విధానానికి అనుమతించిన అధికారులు కూడా భవిష్యత్‌లో సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. ఎక్కడైనా ఖనిజాలుంటే వాటిని వెలికి తీసి విక్రయించడంద్వారా ఆదాయాన్ని ఆర్జించడం ఏపీఎండీసీ ముఖ్య విధి అన్నారు. ఇది కూడా థర్డ్‌పార్టీ ద్వారానే నిర్వహిస్తారని.. అలాంటి సంస్థకు మూలధన వ్యయం పెద్దగా అవసరం లేదన్నారు. అయినా ఇప్పుడు రూ.9వేల కోట్లు కావాలని బాండ్లు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి దారుణమైన నిర్ణయాన్ని చరిత్రలో ఎవరూ తీసుకోలేదని, కూటమి ప్రభుత్వం మాత్రమే ఈ దుశ్చర్యకు పాల్పడిందని అన్నారు. ఇలాంటి విషయాలను యువత గమనించి భవిష్యత్‌లో తగిన గుణపాఠం నేర్పాలని కోరారు.

భద్రతాధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఉక్కునగరం: భద్రతాధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేయాలి స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి జి. ఫణికుమార్ అన్నారు. భద్రతాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ భద్రతాధికారి తమ అనుభవం, నైపుణ్యం రంగరించి ప్లాంట్‌లో రేటును తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. ఉద్యోగులు పని చేసే ప్రదేశాల్లో పొంచి ఉన్న ప్రమాదాలను ముందుగానే గుర్తించి ఉద్యోగుల్లో అవగాహన కల్పించాలన్నారు. జోనల్ సేఫ్టీ ఆఫీసర్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో ప్రాసెస్ సేఫ్టీ, స్టీల్ సేఫ్టీ, ఎస్‌వోపీ, ఎస్‌ఎంపీ సూత్రాలను అమలు పరచడం వల్ల ప్రమాదాల స్థాయి తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో విభాగం డీజీఎంలు వై.ఎస్. రావు, ఎం. వరప్రసాదరావు, బి.కె. మిత్రా, పి.ఎస్. రావు, చింతా మోహనరావు, సాయి ప్రసాదరావు, పుల్లారావు, మోహన్‌బాబు, ఎం.ఎస్. ప్రసాద్, కృష్ణమూర్తి, అభిజిత్ వర్మ, మొగలేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు భద్రతాధికారి ఫణికుమార్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

అవగాహనతో మలేరియాకు చెక్

కూర్మన్నపాలెం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వడ్లపూడి ఆరోగ్యకేంద్రం సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. వడ్లపూడి కూడలి వద్ద ర్యాలీని 87వ వార్డు కార్పొరేటర్ బొండాజగన్ ప్రారంభించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా నిర్వాసితకాలనీ వరకు ప్రదర్శన కొనసాగించారు. మలేరియా అంతం మనతోనే అంటు నినాదాలు చేశారు. కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ మలేరియా నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పి. శివయ్య, నాయకులు రాజానరాజు, రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా

గాజువాక: జీవో 296 ప్రకారం గతంలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ డీడ్‌లను ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై గాజువాక తహసీల్దార్ కార్యాలయంవద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ 296 జీవో ప్రకారం మంజూరు చేసిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు జీవో 30 ప్రకారం కుంచుమాంబ కాలనీ, స్వతంత్రనగర్, రామ్‌నగర్, అప్పన్న కాలనీ, రామచంద్రనగర్ కాలనీలలో అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు డి.రమణ, ఎ.లోకేష్, కిరీటం, సంతోషం, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న జగ్గునాయుడు తదితరులు

ఉత్సాహంగా క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. పౌర గ్రంథాలయం సొసైటీ నిర్వహించిన ఈ పోటీలకు గ్రంథాలయ సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం , విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భూగోళ శాస్త్రంపై క్విజ్ పోటీ జరిగింది. పోటీలో 60 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు. ప్రధాన గ్రంథపాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం రేపు

అగనంపూడి: అగనంపూడి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు తెలిపారు. విశాఖకు చెందిన వీ హెల్త్ కేర్ సౌజన్యంతో ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ, చక్కర వ్యాధి పరీక్షలతో పాటు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. శిబిరాన్ని వాకర్స్‌తో పాటు స్థానికులు వినియోగించుకోవచ్చని తెలిపారు. వి హెల్త్ కేర్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ (జనరల్ ఫిజిషియన్), డెంటిస్ట్ డాక్టర్ స్వర్ణలత సేవలు అందించనున్నారని ఆయన తెలిపారు.